

న్యూస్ బాక్స్

డీఎస్సీ పరీక్షలకు 90 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాల్లో గురువారం రెండు సెషన్స్‌లో నిర్వహించిన డీఎస్సీ పరీక్షలకు 90 మంది గైర్హాజరయ్యారు. మొదటి సెషన్‌లో టీజీటీ(లాంగ్వేజి) ఇంగ్లీష్ పరీక్షకు మొత్తం 871 మంది అభ్యర్థులు హాజరు కావాల్సివుండగా 800 మంది అభ్యర్థులు హాజరై 71 మంది గైర్హాజరయ్యారు. రెండో సెషన్‌లో ఒక పరీక్షా కేంద్రంలో నిర్వహించిన టీజీటీ (నాన్‌లాంగ్వేజి) ఫిజికల్ సైన్స్ పరీక్ష నిర్వహించగా 110 మంది అభ్యర్థులకు గాను 90 మంది అభ్యర్థులు హాజరు కాగా 19మంది గైర్హాజరయ్యారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు.

వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సుకు దరఖాస్తులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ కోర్సులో చేరుందుకు నోటిఫికేషన్ జారీచేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం జాన్సన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు అర్హులని, ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివ రాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 203 మంది హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 203 మంది విద్యార్థులు హాజరయ్యారు. 86,001 నుంచి 1,04,000 వరకు కౌన్సెలింగ్ నిర్వహించగా 154మంది విద్యార్థులు, 49 మంది విద్యార్థినులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ శైలేంద్రకుమార్ తెలిపారు.



నల్లమలలో కళ్లుగప్పి రూ. కోట్లు కొట్టేశాడు..!

నల్లమల.. ఓ అందాల అటవీ ప్రాంతం. చెంచులు, జింకలు, అరుదైన పక్షి జాతులు... లెక్కలేనన్ని చిరుతలు, పెద్దపులులకు ఆవాసం నల్లమల అభయారణ్యం. ఇంతటి సువిశాలమైన అటవీ సంపద ఉన్న నల్లమలలో అవినీతి, అక్రమాలకూ కొదువలేదు. నంద్యాల జిల్లాలోని ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ పరిధిలో ఓ ఇంటి దొంగ వ్యవహారం కలకలం రేపుతోంది. ఐఎఫ్ఎస్ స్థాయి అధికారులను సైతం కళ్లుగప్పి దర్జాగా కొట్లు కొట్టేశాడు. ఇందులో ప్రభుత్వ వ్యవస్థల వైఫల్యం అడుగడుగునా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దీంతో ఈ తతంగం కేవలం శాఖాధిపతులకే తప్ప ప్రభుత్వం దృష్టికి వెళ్లినట్లు లేదు. దీని వల్ల విచారణ సైతం మందకొడిగా సాగుతోంది.

- అటవీశాఖలో ఓ ఉద్యోగి చేతివాటం
- విచారణలో విస్తుపోయే నిజాలు
- ఇప్పటికే రూ.4.35కోట్ల కాజేసినట్లు గుర్తింపు..?
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఈపీఎఫ్, ఈఎస్ఐ స్వాహా
- కొరవడిన ఐఎఫ్ఎస్‌ల పర్యవేక్షణ
- ఆరుగురితో అటవీశాఖ ప్రత్యేక విచారణ
- పరారీలో నిందితులు



చాంద్‌బాషా

ఆత్మకూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ కార్యాలయంలో ఎన్నో ఏళ్లుగా అకౌంట్స్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న చాంద్‌బాషా 2024 జూలైలో ఉద్యోగ విరమణ పొందాడు. అయితే ఆయన పని చేసినంత కాలం అంతులేని అక్రమాలకు పాల్పడ్డాడు. వచ్చే జీతం సరిపోలేదో.. ఏమోకానీ కంచె చేను మేసినట్లుగా అటవీశాఖకు వచ్చే ఆదాయంపై కన్నేసి కోట్ల రూపాయలు కొట్టేశాడు. ప్రత్యేకించి ఆత్మకూరు డివిజన్ పరిధిలోని బైర్లూటి, శిఖరం, లింగాలగట్టు ఫారెస్ట్ చెక్‌పోస్టుల నుంచి ప్రతినెల రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు వసూళ్లవుతోంది. ఈ మొత్తాన్ని రోజువారీగా ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ పేరిట బ్యాంకు ఖాతాలో జమచేస్తారు. నెల రోజులు పూర్తయిన తర్వాత ఆ మొత్తాన్ని ఆర్టీజీఎస్ ద్వారా ఆంధ్రప్రదేశ్ టైగర్ కన్జర్వేషన్ ఫండ్ (ఏపీటీసీఎఫ్)కు బదలాయింపు చేయాల్సి ఉంటుంది. ఇంతవరకు బాగానే ఉంది కానీ.. ఆర్టీజీఎస్ ద్వారా నగదు బదిలీ చేసే వ్యవహారంలో చాంద్‌బాషా చేతివాటం ప్రదర్శించేవాడు. ఒక నెలలో వచ్చిన మొత్తాన్ని ఒకే చెక్కు ద్వారా కాకుండా మూడు, నాలుగు చెక్కులుగా వేరుచేసి అందులో కొన్ని చెక్కులను తన అవసరాల కోసం దారి మళ్లించుకున్నాడు. ఇందులో భాగంగానే 2024 మార్చి, ఏప్రిల్ నెలలో రూ.1,85,793, రూ.17,40,200 విలువ గల రెండు చెక్కులను తమ బంధువులకు సమీప సంబంధించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాలకు మళ్లించి స్వాహా చేశాడు. ఈ విషయాలను సాక్ష్యాత్తు ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా వెల్లడించారు. కాగా డివిజన్‌లో అటవీ చెక్‌పోస్టులు 2016 నుంచి ప్రారంభం కాగా అప్పటి నుంచే చాంద్‌బాషా ఈ తరహాలో నిధుల గోల్‌మాల్‌కు పాల్పడినట్లు తెలుస్తోంది.

బాగోతం బయటపడిందిలా...

ఏళ్ల తరబడి ఇక్కడే తిష్టవేసి ఎవరూ.. ఇక్కడికి బదిలీపై రాకుండా జాగ్రత్తపడిన చాంద్‌బాషా ఎట్టకేలకు 2024 జూలైలో రిటైర్ అయ్యారు. ఆ తర్వాత కూడా కొంతకాలం గౌరవవేతనంతో ఇక్కడే పనిచేయాలని ప్రయత్నించినప్పటికీ అది కుదరలేదు. ఈయన స్థానంలో విశాఖపట్నం నుంచి చంద్రశేఖరరాజు ఇక్కడికి వచ్చారు. అయితే చాంద్‌బాషా అతితక్కువ రికార్డులు అందించడంతో అతనికి అనుమానం వచ్చింది. తొలుత 2024 మే, ఏప్రిల్ నెలలవి పరిశీలించగా అందులో ఏకంగా రూ.20లక్షల వరకు అవకతవకలు చోటుచేసుకున్నాయి. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి లోతుగా దర్యాప్తు చేయగా ఇప్పటి వరకు రూ.4.35కోట్ల అవినీతి వెలుగు చూసింది.

చెక్కులో పేరు ఒకటి.. అకౌంట్ నంబర్ మరొకటి

అకౌంట్స్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా ఉన్న చాంద్‌బాషా చాలా తెలివిగా తన అక్రమాలను కొనసాగించాడు. ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ బ్యాంకు ఖాతాకు జమచేసిన మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్ టైగర్ కన్జర్వేషన్ ఫండ్ (ఏపీటీసీఎఫ్), ఫారెస్టు డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎఫ్‌డీఏ) తదితర సంస్థలకు ఆర్టీజీఎస్ ద్వారా బదిలీ చేసేవారు.

మిగతా 6వ పేజీలో



పేరొకటి.. అకౌంట్ నంబర్ మరొకటి ఉన్న చెక్

పవన్ సొంత నిధులతో కొణిదేల అభివృద్ధి

- కలెక్టర్ రాజకుమారి
- మాట నిలబెట్టుకున్న ఉప ముఖ్యమంత్రి - ఎంపీ బైరెడ్డి శబరి



ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు

నందికొట్కూరు రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంపిన సొంత ట్రస్టు నిధులతో నందికొట్కూరు మండలంలోని కొణిదేల గ్రామాన్ని అభివృద్ధి పరుస్తామని కలెక్టర్ రాజకుమారి అన్నారు. గురువారం నందికొట్కూరు మండలంలోని కొణిదేల గ్రామంలో 90 వేల లీటర్ల సామర్థ్యంతో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ డిప్యూటీ సీఎం తమ సొంత ట్రస్ట్ నుంచి తన ఇంటి పేరుతో వున్న కొణిదేల గ్రామానికి రూ.50లక్షల నిధులు పంపించారని అన్నారు. వీటితో గ్రామంలో ఓవర్ హెడ్ నీటి ట్యాంక్‌ను అత్యున్నత ప్రమాణాలతో నిర్మిస్తున్నామని అన్నారు. అలాగే గ్రామంలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్ నిర్మిస్తామన్నారు. అనంతరం ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ 2019 ఎన్నికల ప్రచారానికి వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నందికొట్కూరులో హెలికాప్టర్ దిగేందుకు హెలీప్యాడ్ సిద్ధం కాకపోవడంతో పక్కనే వున్న కొణిదేల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దిగారని గుర్తుచేశారు. ఆ సందర్భంగా తన ఇంటి పేరుతో ఉన్న కొణిదేల గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని అన్నారని చెప్పారు. ఈ మేరకు కొణిదేల అభివృద్ధికి నిధులు పంపారని అన్నారు. ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఓవర్ హెడ్ ట్యాంక్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా పిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్, చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షుడు హరిప్రసాద్, బీజేపీ జిల్లా నాయకుడు చల్లా దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

5న ముంపు బాధితులకు చెక్కులు

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్



కొక్కెరంచలో ముంపు బాధితుల వారసత్వపు రికార్డులు పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్

కొత్తపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టులో గతంలో భూములు కోల్పోయి పరిహారం అందని ముంపు బాధితులకు జూలై 5న చెక్కులు పంపిణీ చేయనున్నట్లు హంద్రీ నీవా సుజల స్రవంతి యూనిట్-4 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన కొత్తపల్లి మండలంలోని కొక్కెరంచ గ్రామంలో ఎదురుపాడు, గోకవరం, కొక్కెరంచ, ఘనాపురం గ్రామాలకు చెందిన శ్రీశైలం ప్రాజెక్టు ముంపు బాధితుల వారసత్వపు రికార్డులను స్థానిక తహసీల్దార్ ఉమారాణి, డివిజనల్ సర్వే అధికారులు శివకుమార్, సుబ్బయ్యతో కలిసి పరిశీలించారు. అనంతరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం సమయంలో భూములు కోల్పోయిన రైతుల్లో కొందరికి సరైన రికార్డులు లేకపోవడం వల్ల అప్పట్లో పరిహారం అందలేదని అన్నారు. ప్రస్తుతం ఈ నాలుగు గ్రామాలకు చెందిన 75 మంది అవార్డీల కుటుంబ సభ్యులు హాజరు కావాల్సి ఉండగా.. 54 మంది మాత్రమే హాజరయ్యారని చెప్పారు. ముంపు బాధితరైతులకు జూలై5న కర్నూలులోని లోక్‌అదాలత్ న్యాయాధికారుల సమక్షంలో చెక్కులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో కొక్కెరంచ, గోకవరం వీఆర్వోలు వేణుగోపాల్ గౌడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇక నుంచి ఉచిత ప్రసాదం

మహానంది దేవస్థానం ఏఈవో ఎర్రమల మధు



భక్తులకు నిరంతరం ఉచిత ప్రసాదం పంపిణీ చేస్తున్న సేవకులు

మహానంది, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులకు ఇక నుంచి ఉచిత ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు ఏఈవో ఎర్ర మల్ల మధు గురువారం తెలిపారు. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు మహానంది ఆలయంలో ఉచిత ప్రసాదం పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి పర్యవేక్షకుడు పసుపుల సుబ్బారెడ్డి, ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

భక్తా.. ఇక సెలవు..!

- కృష్ణమ్మ ఒడిలోకి సంగమేశ్వరుడు
- శిఖరాగ్రానికి చేరిన జలాలు
- శ్రీశైలానికి లక్ష క్యూసెక్కులకు పైగా వరద

కొత్తపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు 15 రోజుల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద వచ్చి చేరుతోంది. దీంతో శ్రీశైలం జలాశయం నీటిమట్టం పెరుగుతుండటంతో సంగమేశ్వర ఆలయం శిఖరాగ్రానికి చేరువకు జలాలు చేరుకున్నాయి. కేవలం ఒక అడుగు మాత్రమే శిఖరం భక్తులకు దర్శనం ఇస్తోంది. ఇలాగే వరద కొనసాగితే శుక్రవారం సాయంత్రం లోపు శిఖరం కూడా పూర్తిగా జలాదివాసం కానుంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి 863.10 అడుగులుగా నమోదైంది. అలాగే రిజర్వాయరు పూర్తి స్థాయి నీటి నిల్వలు 215 టీఎంసీలు కాగా 115.7856 టీఎంసీలుగా రికార్డయింది. జూరాల ప్రాజెక్టు నుంచి శ్రీశైలం రిజర్వాయరుకు 27,461 క్యూసెక్కులు, సిల్పవే ద్వారా 73,998 క్యూసెక్కులు వరద నీరు శ్రీశైలం ప్రాజెక్టుకు వచ్చి చేరింది. దీంతో మొత్తం 1,14,059 క్యూసె క్కుల వరద వచ్చి శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. ఇక సంగమేశ్వ రాలయం పూర్తిగా నీట మునగడంతో ఎగువన ఉన్న ఉమామహేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేస్తున్నారు. ఇక రిజర్వాయరులో నీటి మట్టం తగ్గిన తర్వాతనో.. లేదా వచ్చే ఏడాది మహా శివరాత్రి తర్వాతనే సంగమేశ్వరస్వామి దర్శనం ఉండవచ్చు.



శిఖరాగ్రానికి చేరువలో సంగమేశ్వరాలయ శిఖరం

'తలనీలాల' కోసం రూ.1.85 కోట్లు!

- మద్దిలేటి క్షేత్రంలో వేలంపాట..

దక్కించుకున్న గుంటూరువాసి

బేతంచెర్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో తలనీలాలను ప్రోగు చేసుకునేందుకు గురువారం అధికారులు వేలంపాట నిర్వహించారు. ఈ వేలంలో గుంటూరు జిల్లాకు దాచేపల్లికి చెందిన నాగరాజు రూ.1,85,40,000 మొత్తానికి పాట పాడి హక్కులను సాధించుకున్నారు. తలనీలాలకు వేలంపాట నిర్వహణను దేవదాయ శాఖ పర్యవేక్షణాధికారి రమేష్, ఆలయ ఈవో రామాంజనేయులు సమక్షంలో నిర్వహించారు. ఏడాది పాటు దేవస్థానంలో భక్తులు సమర్పించిన తలనీలాలు ప్రోగు చేసుకుని హక్కును నాగరాజు దక్కించుకున్నారన్నారు.

డోన్ ఏడీఏ బదిలీ

డోన్ రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): డోన్ వ్యవసాయ ఏడీఏ అశోక్ వర్ధన్ రెడ్డి బదిలీ అయ్యారు. డోన్ నుంచి ఎమ్మిగనూరు వ్యవసాయ కార్యాలయం సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌కు ఆయన బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం అశోక్ వర్ధన్ రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో ఆలూరుకు చెందిన సునీత డోన్ ఏడీఏగా బదిలీపై రానున్నారు.

మాదక ద్రవ్యాలతో నష్టం

న్యాయాధికారి అమ్మన్న రాజు

నంద్యాల క్రైం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిస అయితే దుష్ప్రయోజనాలకు గురికావాల్సి ఉంటుందని 3వ జిల్లా అదనపు న్యాయాధికారి అమ్మన్నరాజు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమరవాణా వ్యతిరేకదినం సందర్భంగా పట్టణంలోని బుడగజంగాల కాలనీలో మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి అమ్మన్నరాజు మాట్లాడుతూ యువత మత్తుకుదూరంగా ఉండి లక్ష్యసాధనవైపు పయనించాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌వాడటంతో కుటుంబసభ్యులతో ప్రేమానుబంధాలు తగ్గిపోయి ఆర్థిక ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐ ఇస్మాయిల్, న్యాయవాదులు ఖలీల్, రమేష్, కృష్ణారెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి, మద్దిలేటి, బుడగజంగాల కాలనీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి అమ్మన్న రాజు

సమష్టి కృషితో మాదక ద్రవ్యాల నివారణ

\- ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

7

భవిష్యత్‌పై దృష్టి సారించాలి

- న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

స్వర్ణరథంపై ఆది దంపతులు

నంద్యాల ఎడ్యుకేషన్(శ్రీశైలం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీశైలంలో ఆది దంపతులు మల్లికార్జున, భ్రమరాంబికాదేవి స్వామి, అమ్మవారు స్వర్ణరథంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పండితులు ఉదయం మహన్యాసకపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం తదితర విశేషపూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను స్వర్ణరథంపై ఉంచారు. కోలాటం, డోలు వాయిద్యం మొదలైన జానపద కళాత్మక ప్రదర్శనల నడుమ రథోత్సవం వైభవంగా కొనసాగింది.



స్వర్ణరథాన్ని లాగుతున్న భక్తులు



పార్వతీ పరమేశ్వరుల అలంకరణలో చిన్నారులు

నేత్రరక్ష..!

- ఆరోగ్యరమైన దృష్టికి కళ్లద్దాలు కీలకం
- నేడు జాతీయ సన్ గ్లాసెస్ దినోత్సవం



పాణ్యం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అన్నది నానుడి కాదు నగ్నసత్యం. శరీరంలో అతి సున్నితమైన భాగాల్లో నేత్రాలు ప్రధానమైనవి. ప్రపంచాన్ని చూపెట్టే కళ్లను మనం కూడా అంతే జాగ్రత్తగా కాపాడుకోవాలి. కళ్లను కాపాడుకోవడంలో ప్రధాన భూమిక పోషించేవి కంటి అద్దాలు. నేటి ఎలక్ట్రానిక్ వస్తువుల అవసరాలు, అలవాట్లతో చిన్నవయసులోనే దృష్టిలోపాలు పెరుగుతున్నాయి. అతినీలలోహిత కిరణాల నుంచి కాపాడే కళ్లద్దాలపై అవగాహన కల్పించడానికి ప్రతి యేటా జూన్ 27 వ తేదీన జాతీయ సన్‌గ్లాసెస్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. విజన్ కౌన్సిల్ ద్వారా సన్‌గ్లాసెస్ దినోత్సవానికి జీవం పోసింది. కళ్ల రక్షణకు కళ్లద్దాల ప్రాముఖ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దినాన్ని ఏర్పాటు చేసింది. కంటి వ్యాధులు, ప్రమాదాలు తగ్గించడానికి కళ్లద్దాలు ఎంతో ప్రాముఖ్యనిస్తాయి. ప్రకాశవంతమైన సూర్యరశ్మి నుంచి కళ్లకు ఉపశమనం కలిగిస్తాయి. కంటి అలసట, అసౌకర్యాన్ని తగ్గిస్తాయి.

పొలాల్లోనే పొగాకు

- ధర లేక రైతుల కష్టాలు



ఎర్రగుంట్ల పొలాల్లో టార్పిన్ పట్టాల కింద కప్పి ఉంచిన పొగాకును చూపిస్తున్న రైతులు

బండి ఆత్మకూరు జూన్26(ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుగోళ్ళు లేకపోవడంతో రైతులు పొలాల్లో, గోదాముల్లో, ఇళ్ళలోనే నిలువ చేశారు. సుమారు ఐదు నెలల పాటు కష్టనష్టాలకు ఓర్చి సాగు చేసిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవటంతో రైతులు విలవిలలాడిపోతున్నారు. ఎకరం పొలం రూ.30వేల నుంచి రూ.40వేల వరకు ఖర్చు చేసి కొందరు రైతులు, ముందుగానే కౌలు చెల్లించి ఇంకొందరు రైతులు మండలంలోని ఎర్రగుంట్ల, పెద్దదేవళాపురం, సంతజూటూరు గ్రామాల్లో పొగాకు పంటను సుమారు 3వేల ఎకరాల్లో సాగు చేశారు. ఎకరానికి రూ.లక్ష మేర పెట్టుబడులు పెట్టారు. ఆకుకు పొగ పెట్టేందుకు కర్రలతో, పట్టాలు కప్పిన షెడ్లు వేసి, నెల రోజుల పాటు పొగబెట్టి పొగాకు తోరణాలు దించారు. అమ్మకం సమయానికి బేలు (100కేజీ) రూ.4వేల నుచి రూ 7వేల వరకు పలికింది. గతంలో బేలు రూ.13000 దాకా కంపెనీలు కొన్నాయి. ఇప్పుడు ఘోరంగా ధర పడిపోయిందని రైతులు అంటున్నారు.

అప్పులు తీరవు

ఈ ఏడాది నేను 8.50 ఎకరాల్లో పొగాకు పండించాను. పొగాకు త్వరగా గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయకపోతే అప్పులు తీరవు. వర్షం వస్తే పొలాల్లో ఉన్న పొగాకు తడిసిపోయే ప్రమాదం ఉంది. కంపెనీలు ప్రభుత్వం సూచించిన మేరకైనా రూ.12500 చెల్లించి కొనాలి.

- జయరాణి, రైతు

ప్రభుత్వమే కొనాలి

ఐదెకరాల్లో పొగాకు సాగు చేశాను. ఎకరానికి రూ. లక్ష మేర అప్పు చేశాను. పంట చేతికి వచ్చి రెండు నెలలైనా కొనడం లేదు. ఆకు మండె తిప్పటం, పొగాకు బేళ్ళు నంద్యాలకు తీసుకెళ్తే తేమ ఉందని తిరిగి పంపించారు. గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనాలి.

- దస్తగిరి, రైతు

నల్లమలలో కళ్లుగప్పి రూ.కోట్లు కొట్టేశాడు..!



ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ కార్యాలయం

(5వ పేజీ తరువాయి)

ఈక్రమంలో చెక్కుపై ఫలానా సంస్థ పేరును బ్యాంకు అకౌంట్ నంబర్ స్థానంలో తనవాళ్లకు చెందిన ఇతర బ్యాంకు అకౌంట్ నంబర్లను రాసేవాడు. ఇది గమనించని డ్రాయింగ్ ఆఫీసర్లు చెక్కుపై సంతకాలు చేయగా ఆ తర్వాత ఆర్టీజీఎస్ ఫారమ్‌పై కూడా పేరు ఒకటి.. అకౌంట్ నంబర్ మరొకటి రాసి ఆఫారమ్‌పై ఆయనే సంతకం చేసి దర్జాగా తన బినామీ వ్యక్తుల బ్యాంకు ఖాతాలకు అటవీశాఖ సొమ్మును మళ్లించాడు. అయితే నగదు బదిలీకి సంబంధించిన నెఫ్ట్ ఫారమ్‌లో కూడా అధీకృత అధికారి(డిప్యూటీ డైరెక్టర్) సంతకం ఉండాలని తెలిసింది. కానీ ఆ స్థానంలో చాంద్‌బాషా సంతకం చేసినప్పటికీ అవేమి పరిగణలోకి తీసుకోకుండా యూనియన్ బ్యాంకు అధికారులు నగదు బదిలీ చేయడం గమనార్హం. ఇదిలావుంటే యూనియన్ బ్యాంకు నుంచి అదే బ్యాంకుకు నగదు బదిలీ చేస్తున్న సందర్భంలో మాత్రమే అకౌంట్ వివరాలు కనిపిస్తాయి. యూనియన్ బ్యాంకు నుంచి ఇతర బ్యాంకులకు బదిలీ చేసినట్లయితే యూనియన్ బ్యాంకు సైట్‌లో ఖాతా వివరాలు కనిపించవు. ఇదేఅదునుగా చాంద్‌బాషా యూనియన్ బ్యాంకు నుంచి ఇతర బ్యాంకులను సొమ్మును బదిలీ చేస్తూ వచ్చాడు.

అడ్డగోలుగా అటవీ సొమ్ము మళ్లింపు

అటవీశాఖకు సమకూరిన ఆదాయాన్ని బాధ్యతగా నిర్దేశించిన బ్యాంకు ఖాతాలకు జమచేయాల్సిన చాంద్‌బాషా అడ్డగోలుగా దారిమళ్లించినట్లు స్పష్టమవుతోంది. చెక్‌పోస్టుల నుంచి వచ్చిన ఆదాయంలో చేతివాటం ప్రదర్శించడమే కాకుండా ఇతర చెల్లింపులు, కొనుగోలు వ్యవహారంలో కూడా ఇదే పంథాను కొనసాగించాడు. అందులో ప్రధానంగా డీజిల్ బిల్లులకు సంబంధించి తనవారికి చెందిన మూతబడిన రాకిన్ ప్యూయల్స్ ఖాతాకు రూ.17.40లక్షలను ఆర్టీజీఎస్ చేయించాడు. అదేవిధంగా తన కుటుంబీకులైన హమీదా, మగ్బూల్‌బాషాలకు ఒక్కొక్కరికి రూ.20లక్షల చొప్పున చెక్కుల ద్వారా నగదు బదిలీ చేశాడు. అంతేకాదు అడవుల్లో ఏర్పాటు చేసే ఇన్‌ఫ్రారెడ్ కెమెరాల కొనుగోలుకు సంబంధించి రూ.30లక్షల వరకు హైదరాబాద్‌కు చెందిన గ్లోబల్ టెలికమ్యూని కేషన్స్‌కు పంపించినట్లు తెలిసింది. నిజానికి ఆ సంస్థ నుంచి ఎన్ని కెమెరాలు కొనుగోలు చేశారు? వాటిని ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు, కొనుగోలుకు ముందు కొటేషన్ వ్యవహారం ఇలాంటిదేమి లేదు. అందులో కూడా భారీగా నొక్కేసినట్లు సమాచారం.

అమాయకులను బలిచేసి

ఆత్మకూరు అటవీశాఖ పరిధిలో అవసరమైన వివిధ బిల్లుల పుస్తకాలు, ఇతర స్టేషనరీకి సంబంధించిన ప్రతులను ఆత్మకూరులోని మహేశ్వర ప్రింటర్స్ వద్ద తయారు చేయిస్తుంటారు. ఈ క్రమంలో ఆ ప్రింటర్స్ యజమాని శివయ్యతో చాంద్‌బాషా పరిచయం చేసుకుని దారిమళ్లించే చెక్కులను శివయ్య అకౌంట్‌కు పంపి తద్వారా నగదు పొందేవాడు. ఈ లెక్కన శివయ్య, ఆయన భార్య, తల్లి బ్యాంకు ఖాతాల నుంచే రూ.2.5కోట్లకు పైగా డ్రా చేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో శివయ్యను నిందితుడిగా చేర్చినట్లు తెలిసింది. అయితే తాను అమాయకుడినని, తనకేమి తెలియదని శివయ్య అటవీ, పోలీసు అధికారుల వద్ద ప్రాధేయపడినట్లు తెలిసింది. అయినప్పటికీ శివయ్యతో పాటు అతని భార్య, తల్లి బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారు. దీంతో శివయ్య కుటుంబీకులు లబోదిబోమంటున్నారు.

అయోమయంగా ఆడిట్

చాంద్‌బాషా పనిచేసినంత కాలంగా ప్రతిఏటా ఇక్కడ ఆడిట్ అయోమయంగా జరిగినట్లు విమర్శలు ఉన్నాయి. వాస్తవానికి ఇతర ప్రభుత్వశాఖ ఆడిట్ బృందాలు ప్రత్యేకంగా వచ్చి అన్ని కోణాలు దర్యాప్తు చేస్తాయి. అయితే అటవీశాఖలో మాత్రం సర్కిల్ ఆఫీసుకు చెందిన వారు వచ్చి ఆడిట్ చేస్తారు. వారు ఎంతవరకు జమ, ఖర్చుల వివరాలను పరిశీలించారే తప్ప ఆ సొమ్ము ఎక్కడికి బదిలీ అయింది, ఆ ఓచర్లు, ఇతర బిల్లుల పరిస్థితి ఏంటన్న వివరాలను పట్టించుకోలేదు. చివరికి సర్కిల్ ఆఫీసులో పని చేసే వారు సైతం చాంద్‌బాషా సరిగ్గానే డబ్బు బదిలీ చేస్తున్నాడా..? అన్నది ఏనాడూ చూసుకోలేదు. అంతేకాదు డ్రాయింగ్ ఆఫీసర్లు కూడా డబ్బు జమచేసి రిసిప్ట్‌లను పరిశీలించిన దాఖలాలు లేవు. ఇలా వ్యవస్థలో పర్యవేక్షణ లోపించడంతో చాంద్‌బాషా అక్రమాలు దర్జాగా సాగాయి.

ఉద్యోగుల ఈపీఎఫ్, ఈఎస్ఐ కూడా స్వాహా

అటవీశాఖలో దేన్నీ వదలని చాంద్‌బాషా తన అవినీతిని కొనసాగించాడు. చివరికి చిన్నపాటి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఈపీఎఫ్, ఈఎస్ఐని వదల్లేదు. వాస్తవానికి ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ పరిధిలో పనిచేస్తున్న సుమారు 330 మంది ప్రొటెక్షన్ వాచర్లు, డ్రైవర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా తదితర ఔట్‌సోర్సింగ్ విభాగాల్లో పని చేస్తున్నారు. వీరికొచ్చి కొద్దిపాటి వేతనం నుంచి ప్రతినెల ఈపీఎఫ్, ఈఎస్ఐ కొంత తీసేసి ఆయా సంస్థలకు జమ చేయాల్సి ఉంటుంది. ఆ సొమ్మును కూడా జమ చేయకుండా తన అవసరాలకు డ్రా చేసుకున్నట్లు తెలిసింది. ఈఎస్ఐ కచ్చితంగా ఆన్‌లైన్ లేదా చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. కానీ.. ఆ సొమ్ముకు కూడా చెక్కు రాసి డ్రా చేయడంలో ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

అంతా చాంద్‌బాషా కనుసన్నల్లోనే

చాంద్‌బాషా పనిచేసినంత కాలం ఇక్కడ అంతా ఆయన కనుసన్నల్లోనే సాగినట్లు తెలుస్తోంది. తన కోటరీతో వచ్చిన డిప్యూటీ డైరెక్టర్లను మచ్చిక చేసుకుని తను చెప్పిందే వేదంగా పనులు జరిగించుకున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే ఐఎఫ్ఎస్ అధికారులు సైతం చాంద్‌బాషా చెప్పిన చోట సంతకాలు చేస్తూ వచ్చారని ప్రచారం ఉంది. అంతేకాదు రేంజర్లను కూడా చాంద్‌బాషా తన గుప్పిట్లో పెట్టుకున్నట్లు తెలిసింది. అడవుల్లో జరిగే వివిధ సివిల్ వర్క్, ఇతర సీడ్ ప్లాంటేషన్ తదితర పనులకు సంబంధించి బిల్లులన్నీ చాంద్‌బాషే చక్కదిద్దేవాడు. అక్కడ పనులు జరిగినా, జరగకున్నా.. కావాల్సినంతా బిల్లులు డ్రా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందులో రేంజర్లకు కూడా భారీగా వాటాలు ముట్టినట్లు విమర్శలు లేకపోలేదు. వాస్తవానికి రేంజ్ పరిధిలో జరిగే పనులన్నీ చెక్కుల ద్వారానే లావాదేవీలు జరగాల్సి ఉంది. కానీ ఓ రేంజర్ అటువంటి చెక్కులను తన సతీమణి పేరుతో డ్రా చేసుకున్న సందర్భాలను ప్రస్తుతం అటవీ అధికారులు గుర్తిస్తున్నారు. అదే రేంజర్ చాంద్‌బాషా రిటైర్ అయినప్పటికీ ఆయన్ను కొనసాగించేలా ప్రయత్నాలు చేశాడు.



చాంద్‌బాషా అక్రమాలను ఆధారాలతో సహా వెల్లడిస్తున్న ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా (ఫైల్)

ఆరుగురితో విచారణ బృందం

ఆత్మకూరు అటవీశాఖను కుదుపేసిన చాంద్‌బాషా వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడు చాంద్‌బాషా పరారీలో ఉన్నారు. అదేక్రమంలో అటవీశాఖ కూడా ఈ ఘటనపై పీసీసీఎఫ్ ఏకే నాయక్ మే 19వ తేదిన ఒక ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించారు. ఇందులో ఎస్ఎన్‌టీఆర్ ఎఫ్‌డీపీటీ బీ.ఏ.కృష్ణమూర్తి, విజిలెన్స్ డీఎఫ్ఓ ఎన్.శివకుమార్, నంద్యాల సర్కిల్ అకౌంట్స్ ఆఫీసర్ పద్మావతి, ఆత్మకూరు, నంద్యాల డివిజన్లకు చెందిన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు చంద్రశేఖరరాజు, జీఎస్. రవికుమార్, రమేష్‌లను నియమించింది. కానీ.. ఇప్పటివరకు వీరిలో ముగ్గురు మాత్రమే ఒక విచారణ చేశారే తప్ప మిగతా దర్యాప్తును పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై ప్రభుత్వం దృష్టి సారించి ప్రత్యేక విజిలెన్స్ కమిటీ లేక సిట్ వేస్తే తప్ప త్వరగా కొలిక్కి వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది.

సమగ్ర దర్యాప్తుకు సహకరిస్తున్నాం



తమ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేసి రిటైర్డు అయిన చాంద్‌బాషాపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశాము. ప్రస్తుతం ఆయన పరారీలో ఉండి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్లు వేయడంతో పోలీసులు కూడా కౌంటర్ ఫైల్ చేస్తున్నారు. ఇప్పటికే ఆయన చేసిన అక్రమాలపై సమగ్రంగా విచారిస్తున్నాము. పోలీసుల విచారణకు కూడా పూర్తిస్థాయిలో సహకరిస్తున్నాము. ఎవరైతే బినామీలుగా వ్యవహరించారో వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటాము. అలాగే పీసీసీఎఫ్ ఏకే నాయక్ ఆదేశాల వరకు ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటైంది. వారు కూడా దర్యాప్తు చేయనున్నారు.

- వి.సాయిబాబా, ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్, డిప్యూటీ డైరెక్టర్

విజిలెన్స్ తనిఖీలు



తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు

నంద్యాల రూరల్, నంద్యాల కల్చరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణ శివార్లలోని ఆటోనగర్ వద్ద నందిమిల్క్ డెయిరీ, చాబోలు రస్తాలో నాగశివ ట్రేడర్స్‌లో గురువారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఆదేశాల మేరకు చౌడేశ్వరీ ఆదేశాల మేరకు విజిలెన్స్, ఫుడ్‌సెఫ్టీ, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసినట్లు ఫుడ్‌సేఫ్టీ అధికారి వెంకటరాముడు తెలిపారు. నంది మిల్క్ డైయిరీని తనిఖీ చేసి ప్యాకింగ్‌కు అనుమతులు లేవని గుర్తించి లీగల్ మెట్రాలజీ అధికారులు జిలానీ, అనిత రూ.25వేలు జరిమానా విధించారు. అలాగే పాలు, నెయ్యి, పెరుగు శాంపిల్స్ అధికారులను సేకరించారు. వీటిని హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించనున్నట్లు తెలిపారు. ల్యాబ్ నివేదికలు రాగానే చర్యలు తీసుకుంటామని అన్నారు. ల్యాబ్, బాయిలర్‌కు సంబంధించిన అనుమతులు లేవని, రికార్డులు కూడా సరిగ్గా లేవని అన్నారు. అలాగే చాబోలు రస్తాలో నాగశివ ట్రేడర్‌లో లూజుగా కందిబేడలు విక్రయిస్తున్నారని, బ్రాండెడ్ పేరుతో స్టిక్కర్లు అంటించి అమ్ముతున్నారని విజిలెన్స్ సీఐ పవన్‌కిషోర్ తెలిపారు. లీగల్ మెట్రాలజీ అధికారులకు రిపోర్టు సమర్పిస్తామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

చేనేత వస్త్రాల భౌగోళిక గుర్తింపునకు చర్యలు

- 'రిజల్యూట్' ఆధ్వర్యంలో డాక్యుమెంటరీ
- టవల్స్, బెడ్‌షీట్స్‌ను పరిశీలించిన సంస్థ ప్రతినిధి



అధికారులతో మాట్లాడుతున్న రిజల్యూట్ సంస్థ ప్రతినిధి శ్రీవాత్స

ఎమ్మిగనూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 'ది ఎమ్మిగనూరు చేనేత సహకార సొసైటీ(వైడబ్ల్యూసీఎస్)'కి చెందిన చేనేత వస్త్రాలకు భౌగోళిక గుర్తింపునకు చర్యలు తీసుకుంటున్నారు. ఈమేరకు డాక్యుమెంటరీని రూపొందించేందుకు హైదరాబాద్‌కు చెందిన రిజల్యూట్ ఫర్ ఐపీ సంస్థ లీగల్ ప్రతినిధి శ్రీవాత్స గురువారం వైడబ్ల్యూసీఎస్‌ను సందర్శించారు. సహకార సొసైటీకి చెందిన ఏడీ, కార్యదర్శి అప్పాజీ, జిల్లా డీవో నరేంద్రరెడ్డితో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సొసైటీ పూర్వపరాలు, స్థానికంగా తయారవుతున్న వస్త్రాల గురించి తెలుసుకున్నారు. టవల్స్, బెడ్‌షీట్లను పరిశీలించారు. అనంతరం శ్రీవాత్స విలేకరులతో మాట్లాడారు. వైడబ్ల్యూసీఎస్‌లో తయారైన బర్డ్‌ఐ టవల్స్, బెడ్‌షీట్లకు భౌగోళిక గుర్తింపుకోసం డాక్యుమెంటరీ తీసి కేంద్రప్రభుత్వానికి పంపుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం పరిశీలించి జియోకు అనుమతిస్తుందన్నారు. సొసైటీ వస్త్రాలకు భౌగోళిక గుర్తింపు లభిస్తే వస్త్రాల ధరలు 30శాతం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. సొసైటీ సెక్రటరీ, ఏడీ అప్పాజీ మాట్లాడుతూ 1938లో చేనేత సహకార సంఘాన్ని పద్మశ్రీ మాచాని సోమప్ప స్థాపించారన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో 16 విక్రయశాలలు ఏపీ, తెలంగాణ కర్ణాటకలో ఉన్నాయన్నారు. రూ. 3కోట్ల టర్నోవర్‌తో సొసైటీ నడుస్తుందని అన్నారు. ఇక్కడి వస్త్రాలకు భౌగోళిక గుర్తింపు లభిస్తే మరింత అభివృద్ధి చెందే అవకాశముందన్నారు. సొసైటీ డిజైనర్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

29న టీజీవీ కళాక్షేత్రంలో 'స్వేచ్ఛ'

కర్నూలు కల్చరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో నెలనెలా నాటక ప్రదర్శనల్లో భాగంగా ఈనెల 29న సాయంత్రం 7 గంటలకు హైదరాబాదుకు చెందిన బీఎం రెడ్డి దర్శకత్వంలో 'స్వేచ్ఛ' సాంఘిక నాటిక ప్రదర్శన ఉంటుందని ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నాటిక రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శించిన ప్రతిచోటా పురస్కారాలు అందుకొని సంచలనం సృష్టించిందని, ఈ నాటికలో 'బలగం' సినిమా ఫేం నటి సురభి లలిత ఒక ముఖ్యపాత్రలో నటిస్తున్నారని ఆయన తెలిపారు. అలాగే ఈ నాటిక ప్రదర్శనకు ముందు టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో, కళాక్షేత్రం కళాకారులతో 'శ్రీకృష్ణ రాయబారం (పడక సీను) సన్ని వేశ ప్రదర్శన ఉంటుందని ఆయన తెలి పారు. ఇందులో శ్రీకృష్ణునిగా భాస్కర్ యాదవ్, దుర్యోధనుడిగా చల్లా నవీన్‌కుమార్ చౌదరి, అరునుడిగా కేవీ రమణ నటిస్తున్నట్లు ఆయన వివరించారు.

కొత్తవారు ఎప్పుడొచ్చేనో?

- బదిలీ అయినా అక్కడే విధులు..
- పాత పాఠశాలల్లోనే కొనసాగుతున్న ఉపాధ్యాయులు
- ఏకోపాధ్యాయ, ప్రాథమిక పాఠశాలల్లో సమస్య అధికం
- డీఎస్సీ అభ్యర్థులు వచ్చే వరకు ఇదే పరిస్థితి

కొలిమిగుండ్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు బదిలీలు అయినా కూడా కొత్తవారి రాక కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం ఈఏడాది పెద్దఎత్తున ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టింది. ఉపాధ్యాయులు బది లీలకు దరఖాస్తు చేసుకొని తాము కోరుకున్న స్థానాల్లో కొలువులు సంపాదించారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా చాలామంది బదిలీ అయినా పాత పాఠశాలల్లోనే కొనసాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఖాళీ అయిన స్థానంలో మరో ఉపాధ్యాయుడు రాకపోవడంతో ఉన్నవారు రిలీవ్ కాలేని పరిస్థితి నెలకొంది. ఈసమస్య అధికంగా ప్రాథమిక, ఏకోపాధ్యాయ పాఠశాలల్లో అధికంగా ఉంది. ఉన్నతపాఠశాలల్లో సైతం సబ్జెక్టు టీచర్ల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. బదిలీ అయినప్పటికీ మరో ఉపాధ్యా యుడు వచ్చే వరకూ వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో సుమారు 3వేల మంది ఉపాధ్యాయుల బదిలీలు జరగ్గా 30శాతానికి పైగా ఉపాధ్యాయులు పాత పాఠశాలల్లోనే కొనసాగాల్సిన పరిస్థితి. దీంతో బదిలీ అయినా కోరుకున్న స్థానానికి వెళ్లలేక వారు అసంతృప్తిగా ఉన్నారు. త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

వేగంగా పావులు కదుపుతోంది

ప్రభుత్వం డీఎస్సీ పరీక్షలు జరుగుతున్నాయి. ఇప్పటికే కొన్ని పరీక్షలు పూర్తి కాగా, మరి కొన్ని జరగాల్సి ఉంది. త్వరలోనే పలితాలు ప్రకటించి, వీరికి పోస్టింగ్ ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం వేగంగా పావులు కదుపుతోంది. జూలై 17 తర్వాత పలితాలు వెలువరించి, వెంటనే పోస్టింగ్ ఇవ్వనున్నారు. దీంతో డీఎస్సీ ఉపాధ్యాయులు వచ్చే వరకూ బదిలీ అయిన ఉపాధ్యాయులు పాత స్థానాల్లోనే కొనసాగే అవకాశం ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. నూతన ఉపాధ్యాయులు వచ్చాక బదిలీ అయిన ఉపాధ్యాయులంతా కోరుకున్న స్థానాలకు వెళ్లే అవకాశం ఉంది.



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు

మరో ఉపాధ్యాయుడు రాకపోవడంతో..



కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ ఉత్తర్వులు అందుకున్నాను. పెట్నికోట ఉన్నత పాఠశాలకు నా స్థానంలో మరో ఉపాధ్యాయుడు రాకపోవండతో ఇక్కడే విధులు నిర్వహిస్తున్నా.

- రమణయ్య, తెలుగు పండిట్, పెట్నికోట ఉన్నతపాఠశాల

జూలై 17 తర్వాత డీఎస్సీ అభ్యర్థులు..

బదిలీ అయిన ఉపాధ్యాయులు పలుచోట్ల పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారు. జూలై-17 తర్వాత డీఎస్సీ అభ్యర్థులు పోస్టింగ్ పొందుతారు. వారి రాకతో బదిలీ అయిన టీచర్లు రిలీవ్ కావడానికి మార్గం సుగమమవుతుంది.

- శంకర్ ప్రసాద్, డిప్యూటీ డీఈవో, నంద్యాల

హ్యాపీ బర్త్‌డే బామ్మ..!

కుటుంబ సభ్యుల నడుమ 100వ జన్మదిన వేడుకలు

మద్దికెర, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురుజుల గ్రామానికి చెందిన కాలుగుల హనుమంతమ్మ అనే బామ్మకు వందేళ్ల పూర్తి కావడంతో కుటుంబ సభ్యులు పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ నెల 25వ తేదీకి హనుమంతమ్మకు వందేళ్ల పూర్తి కావడంతో కుటుంబ సభ్యులంతా పుట్టిన ఊరైన బురుజుల గ్రామానికి వెళ్లి అందరూ ఒకే చోట చేరుకుని వేడుకలను జరుపుకున్నారు. ఆ కుటుంబంలో కుమారులు, కోడళ్లు, కుమార్తెలు, అల్లుళ్లలు, మనవళ్లు, మనవరాళ్లు, ముని మనవళ్లు అందరూ కలిసి మొత్తం 89 మందికి బురుజుల చేరుకున్నారు. హనుమంతమ్మ భర్త హనుమంతు 20ఏళ్ల క్రితమే మరణించినప్పటికీ ఆ కుటుం బాన్ని నెట్టుకొచ్చింది. కొడుకులు ప్రయోజకులై వివిధ ప్రాంతాల్లో స్థిరపడిపోయారు. బామ్మ ఆరోగ్యంగా ఉండటం విశేషం.



వందేళ్ల బామ్మ పుట్టినరోజు వేడుకలు చేసుకుంటున్న దృశ్యం

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం

- డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్
- కర్నూలు నగరంలో భారీ ర్యాలీ
- పాల్గొన్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు




ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, డీఐజీ, ఎస్పీ, ఎంపీ, ఎమ్మెల్యే.., నగరంలో ర్యాలీలో పాల్గొన్న అధికారులు, నాయకులు

కర్నూలు హాస్పిటల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు యువత బానిసలైతే జీవితాలు సర్వనాశనం అవుతాయని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా కర్నూలు నగరంలోని రాజ్‌విహార్ సెంటర్ నుంచి అవగాహన ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ వరకు కొన సాగింది. అదేవిధంగా కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో డీఐజీతో పాటు కలెక్టర్ రంజిత్ బాషా, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మేయర్ బీవై రామయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఐజీ కోయ ప్రవీణ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు స్ఫూర్తి పిలుపుతో మాదక ద్రవ్యాల నియంత్రణకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్న నేపథ్యంలో చిన్న కుటుంబాల వల్ల ఒంటరి తనంతో మానవ సంబంధాలు దెబ్బతిని యువత మాదకద్రవ్యాల అలవాట్లకు గురవుతున్నారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుం దన్నారు. పోలీస్ శాఖ సైతం డ్రగ్స్ నివారణపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ డ్రగ్స్ బారిన పడి జీవితాలు నాశనం అవుతున్నాయనీ, ఇలాంటి డ్రగ్స్ మహమ్మారీని నాశనం చేయక పోతే మనుగడ కష్టమన్నారు. మాదక ద్రవ్యాలను నియంత్రించడం, వీటిని సేవించే వారికి రీహాబిలేషన్ చికిత్స అందించడం కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. జిల్లాలో ప్రతి నెల మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ఎక్కడైనా కాలేజీ, పాఠశాలల్లో ఎవరైనా యువత డ్రగ్స్‌కు అలవాటు పడినట్లు తెలిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1972కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. డ్రగ్స్ వినియోగించినా, సరఫరా చేసినా వారిపై ఎన్‌డీపీఎస్ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేస్తామని 6 నెలల వరకు బెయిల్ కూడా రాదన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాల గురించి యువత తెలుసుకుని మంచి మార్గంలో నడవాలని సూచించారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం వల్ల యువత జీవితాలు నాశనం అవుతుందన్నారు. గతంలో డ్రగ్స్ కేవలం పెద్ద నగరాల్లో మాత్రమే ఉండేవని, ఇప్పుడు జిల్లాలకు వ్యాప్తి చెందిందన్నారు. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యం వాడకం, రవాణా విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు, అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ రామకృష్ణారెడ్డి, ఈగల్ టీం ఎస్ఐ సుజన్ కుమార్, ఇన్‌చార్జి ఆర్‌డీవో వెంకటేశ్వర్లు, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, డీఎంహెచ్‌వో పి.శాం తికళ, అడిషినల్ డీఎంహెచ్‌వో ఎల్.భాస్కర్, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ మహేశ్వర్ ప్రసాద్, ఐసీడీఎస్ పీడీ నిర్మల, డీఈవో శామ్యూల్ పాల్, మెప్మా పీడీ నాగ శివలీల పాల్గొన్నారు.

అందరికీ ఉద్యోగాలు ఇవ్వాలి

- జిల్లా ఇంటర్మీడియట్ వృత్తి విద్యాధికారి సురేష్‌బాబు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కళాశాల ప్రిన్సిపాల్‌కు జిల్లా ఇంటర్మీడియట్ వృత్తి విద్యాధికారి సురేష్‌బాబు తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులతో సమావేశం జరిగింది. మూడు సంవత్సరాల కిందట వృత్తి విద్యాకోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఆర్‌డీఎస్‌డీ సంస్థ ఆధ్వర్యంలో టెక్నికల్ ఒకేషనల్ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థులందరికీ జాబ్‌మేళా ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పించాల్సిన బాధ్యత కళాశాలల ప్రిన్సిపా ల్స్, అధ్యాపకులు తీసుకోవాలన్నారు. ప్రిన్సిపాళ్లు జీ.లాలెప్ప, నాగస్వామి నాయక్, పద్మావతి, డీఐఈవో కార్యాలయ అధికారి నాయకంటి సుంకన్న, పరిపాలనా అధికారి పాల్గొన్నారు.

జగన్ పాలన అంతా విధ్వంసమే



- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలన అంతా అరెస్టులు, కబ్జాలు, విధ్వంసంతో సాగిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి విమర్శించారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం హోదాలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్లలో రాష్ట్రానికి ఏమీ చేశారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో అలజడులు సృష్టిస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఇచ్చిన మాటకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఇప్పటికే సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. త్వరలో మహిళలకు ఆడబిడ్డ నిధి, రైతులకు ఆర్థిక తోడ్పాటు, యువతకు నిరుద్యోగ భృతి అందిస్తారన్నారు. పేదరికం లేని సమాజం కోసం చంద్రబాబు కృషి చేస్తుంటే అడ్డుకునేందుకు వైసీపీ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు.

సోదరభావంతో జీవించాలి

- తెలంగాణ విజిలెన్స్ డీజీపీ శ్రీనివాసరెడ్డి



గ్రామస్థులతో తెలంగాణ విజిలెన్సు డీజీపీ కె.శ్రీనివాసరెడ్డి

సి. బెళగల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలందరూ సోదరభావంతో కలిసిమెలసి జీవించాలని తెలంగాణ రాష్ట్ర విజిలెన్సు డీజీపీ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం గ్రామంలో ఎంపీయూపీ పాఠశాలగా ఉన్న స్కూల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయిన సందర్భంగా సర్పంచ్ రవిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు గొడవలు లేకుండా ప్రశాంతంగా జీవిస్తేనే పల్లెలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. గ్రామాల్లో విద్యను అభివృద్ధి చేయాలని, విద్య వలన మేథస్సు పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధమ్మ, మండల విద్యాధికారి ఆదాంబాషా, ఉపాధ్యాయులు క్రిష్ణారెడ్డి, వెంకటేశ్వరగౌడు పాల్గొన్నారు.

రేషనలైజేషన్ తర్వాతే బదిలీ చేయాలి

- ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బంగి శ్రీధర్



మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు బంగి శ్రీధర్

కర్నూలు న్యూసిటీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల రైషనలైజేషన్ ప్రక్రియ శాస్త్రీయంగా పూర్తయ్యాకే బదిలీలు చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బంగి శ్రీధర్ స్పష్టం చేశారు. గురువారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ ఫంక్షనరీస్‌కు సరైన జాబ్ చార్ట్ లేకపోవడం, పదోన్నతులపై సర్వీసు రూల్స్ లేకపోవడం వలన లక్షలాది ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారన్నారు. ప్రొబేషన్ డిక్లరేషన్‌లో గత ప్రభుత్వ కాలయాపన నుంచి సీపీటీ పరీక్షలను రద్దు చేయించడానికి సచివాలయ ఉద్యోగులకు ఏపీజీఈఏ సంఘం అండగా ఉందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సురేష్‌రెడ్డి, నగర కార్యదర్శి చెన్నకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

అవుకు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని మెట్టుపల్లె గ్రామం మెట్ట సమీపంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. వివరాలు.. గోస్పాడు మండలం తేళ్లపురి గ్రామానికి చెందిన నాగేంద్రరెడ్డి(61) గురువారం అవుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చాడు. పని ముగించుకొని మధ్యాహ్నం 3:30గంటల సమయంలో బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. మెట్టుపల్లె గ్రామం మెట్ట సమీపంలోకి వచ్చే సరికి బనగానపల్లె నుంచి వేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. నాగేంద్రరెడ్డి అక్కడికక్కడే మృతిచెం దాడు. బైక్‌ను ఢీకొన్న కారు అదుపు కాక బోల్తా పడి పొలాల్లోకి దూసుకెళ్లింది. కారులో ఎయిర్ బెలూన్లు తెరచుకోవటంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. వారు వేరే వాహనం ఎక్కి పరారయ్యారు. కారు అతివేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తుంది. ఈప్రమాదంలో బైక్ నుజ్జునుజ్జు కాగా కారు ముందు భాగం దెబ్బతింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం అవుకు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య పార్వతమ్మ, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుమారుడు నాగార్జునరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



దెబ్బతిన్న కారు ముందు భాగం

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

జూపాడుబంగ్లా, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని తంగడంచ గ్రామ సమీపంలో చోటు చేసుకున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. వివరాలు.. మండ్లెం గ్రామానికి చెందిన ఇస్మాయిల్(50) సెంట్రింగ్ పనిచేస్తున్నాడు. అతడితో పాటు మరో నలుగురు గురువారం జూపాడుబంగ్లాకు సెంట్రింగ్ సామగ్రిని ఆటోలో తీసుకువస్తున్నారు. పారుమంచాల చెక్‌పోస్టు సమీపంలో మలుపు వద్ద ఆటో బోల్తాపడింది. ఈఘటనలో అందులో ఉన్న ఇస్మాయిల్ శ్రీనివాసులు, అబ్దుల్లాకు తీవ్రగాయాలు కాగా, రఫీకి స్వల్ప గాయాల య్యాయి. క్షతగాత్రులను నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ఇస్మా యిల్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భవిష్యత్‌పై దృష్టి సారించాలి

- న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్




మాట్లాడుతున్న న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్, ప్రసంగిస్తున్న ఎన్నికల పరిశీలకుడు ఆలం నరసానాయుడు

నంద్యాల రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): చక్కటి ప్రణాళికతో భవిష్యత్ లక్ష్యంపై దృష్టి సారించాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం నంద్యాల పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నంద్యాల నియోజకవర్గ స్థానిక సంస్థల క్రియాశీలక ఎన్నికల ప్రక్రియ కార్యక్రమాలపై పార్టీ పరిశీలకులతో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసా నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ పార్టీలో క్రమశిక్షణను పాటిస్తూ అంకితబావంతో పని చేయడమే ప్రధాన కర్తవ్యమన్నారు. తాను ఎన్టీఆర్, చంద్రబాబు కేబినెట్‌లో పనిచేయడం, నారా లోకేశ్‌తో మంత్రివర్గంలో ఉండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సాధించాల్సిన లక్ష్యాల కోసం ప్రణాళికతో ముందుకు వెళ్లడమే తక్షణ కర్తవ్యమన్నారు. ప్రభుత్వం సాధిస్తున్న విజయాలను వివరిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్లాలన్నారు.

పార్టీలో కష్టపడిన వారికే గుర్తింపు : ఆలం

పార్టీలో కష్టపడిన వారిని గుర్తించి వారికే ప్రాధాన్యం ఇస్తామని ఎన్నికల పరిశీలకులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు స్పష్టం చేశారు. టీడీపీ క్రమశిక్షణకు మారుపేరన్నారు. నాయకులు, కార్యకర్తలు చేసిన కృషివల్లే మళ్లీ అధికారంలోకి వచ్చామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జయకేతనం ఎగర వేయాలంటే సమష్టి లక్ష్యాలతోనే సాధ్యమవుతుందన్నారు. సీఎం చంద్రబాబు అందిస్తున్న ప్రజారంజక పాలనలో ఎలాంటి లోపాలు దొర్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత టీడీపీ శ్రేణులపై ఉందన్నారు. ఈ కార్యక్రమం లో నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, పార్టీ పరిశీలకులు అన్సర్‌బాషా, రామేశ్వరరెడ్డి, నబీసాహెబ్, రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఖలీల్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో డ్రగ్స్ నివారణ

నంద్యాల టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌ను నివారించడంలో ప్రతి ఒక్కరి కృషి అవసరం అని కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. గురువారం మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్పీజీ గ్రౌండ్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిరహించారు. వారు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం అనేది మానసికంగా ఆర్థికంగా నాశనం చేస్తుందని అన్నారు. దీంతో యువత చాలా మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇందుకోసం పోలీసు శాఖ ఈగల్ టీం ఏర్పాటు చేసిందన్నారు. ఈ బృందం డ్రగ్స్ ముఠాలకు వ్యతిరేకంగా నిరంతరం నిఘా కొనసాగిస్తుందన్నారు. ఇప్పటి వరకు 37 కేజీల గంజాయిని, 47 మందిని అమ్మిన వారిపై చర్యలు తీసుకున్నామన్నారు. ఆపరేషన్ గరుడలో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో తనిఖీలు చేసి పది మెడికల్ షాపులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పాఠశాలలు, కళశాలలు ల్లో 108 పైగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి 208 అవగాహన కార్యక్రమాలు నిర్వహించమన్నారు. ఇటీవల జీన్ పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో నలుగురికి ఐదేళ్ల కఠి కారాగార శిక్షతో పాటు రూ.25 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికమార్, జిల్లా అధికారులు రాముడు, డీఎంహెచ్‌వో వెంకటరమణ, లీలావతి పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

రైతులందరికీ పరిహారం వచ్చేలా కృషి

- తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి



వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

పాణ్యం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సోలార్ పరిశ్రమ నిర్మాణంతో సాగు భూములు కోల్పోయిన రైతులందరికీ నష్ట పరిహారం అందేలా కృషి చేస్తానని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం గ్రీన్‌కో కంపెనీ పిన్నాపురంలో చేపట్టిన సోలార్ పరిశ్రమ నిర్మాణంలో ప్రభుత్వ సాగు భూములు కోల్పోయిన రైతులతో సర్పంచ్ వెంకటకృష్ణ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు నిర్వహించారు. 2019లో గ్రీన్‌కో సంస్థకు 2467.28 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించామన్నారు. ఈ భూమిలో ఎవరూ సాగులో లేనట్లు రికార్డుల్లో ఉండడంతో సంస్థకు కేటాయించామన్నారు. రికార్డులు లేకుండా పూర్వం నుంచి సాగుచేసుకుంటున్న రైతులకు న్యాయం చేసేందుకు కమిటీని ఏర్పాటు చేసి 197 మంది రైతులను గుర్తించి జాబితా తయారు చేశామన్నారు. ఇందులో ఐదెకరాల వరకే పరిహారం ఇవ్వడానికి పరిమితి అన్నారు. జాబితాలోని రైతుల వివరాలను బహిరంగంగా తహసీల్దార్ చదివి వినిపించారు. కొందరు రైతులు తమ పేర్లు జాబితాలో లేవని ఆందోళన వ్యక్తంచేశారు. జాబితాలో పేర్లు లేని రైతుల అర్జీలు తీసుకొని తప్పనిసరిగా నష్టపరిహారం అందించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాణ్యం సీఐ కిరణ్ కుమార్‌రెడ్డి, ఎస్ఐలు నరేంద్రకుమార్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, ఆర్ఐ రాము, సర్వేయరు నాగరాజు, వీఆర్వోలు బీరేంద్ర, శ్రీనివాసులు, శంకర్, ఏఆర్ పోలీసులు, రైతులు పాల్గొన్నారు.

మొదటి లిస్టులో పేరుంది



గతంలో రెవెన్యూ అధికారులు ప్రచురించిన జాబితాలో నాపేరు ఉంది. ఇప్పుడు ప్రకటించిన జాబితాలో నాపేరు లేదు. నాకు 50సెంట్ల ప్రభుత్వ భూమికి నష్ట పరిహారం అందాల్సి ఉంది. గ్రామసభలో ప్రకటించే వారికి మాత్రమే నష్టపరిహారం అందిస్తే నష్టపోతాను. కొన్నేళ్లుగా ప్రభుత్వ భూమిలో సాగులో ఉన్నాను.

● ఓర్వకంటి నాగలక్ష్మన్న, పిన్నాపురం

సాగులో ఉన్నా జాబితాలో పేరు లేదు



మా పూర్వీకుల కాలం నుంచి ప్రభుత్వ భూమి రెండెకరాలు సాగు చేసుకుంటున్నా. ఇప్పుడు అధికారులు ప్రకటించిన జాబితాలో నా పేరులేదు. నాకు నష్ట పరిహారం ఇవ్వాలి. పంట సాగును అధికారులు గుర్తించకపోవడమే ఇందుకుకారణం.

● బిజ్జమ్మగారి వెంకటరాముడు, పిన్నాపురం

ప్రభుత్వ లాంఛనాలతో మొహర్రం

- రూ.10 లక్షల నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో నవాబు వారసులు

బనగానపల్లె, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వ లాంచనాలతో ఈ ఏడాది మొహర్రం వేడుకలు నిర్వహించనున్నట్లు ఆర్ అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. గురువారం రాత్రి పట్టణంలోని ఆస్థానం పీర్ల వద్ద మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, నవాబు వారుసుడు మీర్ ఫజిల్ అలీఖాన్, షియా ముస్లింలతో కలసి ప్రార్థనలు చేశారు. మతగురువులతో పాటు షియా ముస్లింలు బీసీకి ఘన స్వాగతం పలికారు. మొహర్రం సందర్భంగా మంత్రి బీసీ ప్రత్యేక చొరవతీసుకొని సీఎం చంద్రబాబు, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సహకారంతో మొహర్రం వేడుకలు నిర్వహించడానికి రూ.10లక్షలు నిధులు కేటాయించారన్నారు. వీరికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఆస్థానం పీర్లను మంత్రి బీసీ సందర్శించారు. ఆస్థానం బంగారు పీర్లవద్ద మంత్రి బీసీ ప్రత్యేక ఫాతేహాలు చేశారు. మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముస్లిం, మైనార్టీలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.తొలిసారి బనగానపల్లెలో మొహర్రం వేడుకలకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయించా మన్నారు. ముంబై తర్వాత బనగానపల్లెలోనే ఈ వేడుకలు భారీగా నిర్వహిస్తారన్నారు. ప్రజలు కులమతాలకతీతంగా ఈవేడుకలు సంతోషంగా జరుపుకోవాలని మంత్రి కోరారు.

మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. నవాబు వారసుడు మీర్ ఫజిల్ అలీఖాన్ మాట్లాడుతూ తొలిసారిగా ప్రభుత్వం రూ.10లక్షలు నిధులు కేటాయించినందుకు సీఎం చంద్రబాబునాయుడు, మైనార్టీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

డ్వాక్రా సంఘాల అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే


ట్యాబ్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్ టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ పరిధి లోని మెప్మా డ్వాక్రా సంఘాల రీసోర్స్ పర్సన్లకు సామ్సంగ్ గెలాక్సీ ఏ9 ప్లస్ ట్యాబ్స్ పంపి ణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల సభ్యుల కు సేవలు వేగంగా అందాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం డిజిటల్ విధానాన్ని తెచ్చిందని, మున్సిపాలిటీల వారీగా మహిళా సంఘా ల వివరాలు ఆన్‌లైన్ లో పొందుపరిచేందుకు స్లమ్ సమాఖ్య రిసోర్స్‌ప ర్సన్స్‌కు ఈ ట్యాబ్‌లు ఉప యోగపడుతాయని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడు, మెప్మా అధికారులు, ఎస్‌హెచ్‌జీ రీసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

నాసిరకం వస్తువులు విక్రయిస్తే చర్యలు

బేతంచెర్ల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వ్యాపార దుకాణాల్లో నాసిరకం వస్తువులు విక్రయాలు చేసినా, తూనికల్లో అవకతవకలకు పాల్పడినా శాఖా పరమైన చర్యలు తప్పవని డోన్ తూనికలు కొలతల శాఖ ఇన్స్‌పెక్టర్ నాగరాజు యజమానులను హెచ్చరించారు. గురువారం పట్టణంలోని వివిధ వ్యాపార దుకాణాలను నాగరాజు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో బట్టల షాపునకు రూ.5వేలు, రెండు కిరాణం షాపులకు రూ.11వేలు జరిమానా విధించారు. అలాగే పట్టణంలోని వందేమార్ట్‌ను, హార్డ్‌వేర్ షాపును, గోల్డ్‌మెడల్ ఎలక్ట్రికల్, బ్లూస్టార్ ఎలక్ట్రికల్ షాపులను తనిఖీ చేసి కంపెనీ పేర్లు లేకుండా వైర్లు చైనా ఎలక్ట్రికల్ సరుకులను షాపు యజమానులు విక్రయిస్తున్నారని, వాటిపై కేసులు నమోదు చేసి మూడు షాపులకు రూ.16వేలు జరిమానా విధించారు.

మహిళలకు పింఛన్ పథకాన్ని అమలు చేయాలి

డోన్ రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యాభై ఏళ్లు నిండిన మహిళలకు పింఛన్ పథకాన్ని అమలు చేయాలని ఐద్వా నాయకురాలు షమీమ్ బేగం, సీఐటీయూ నాయకులు చిన్న రెహిమాన్, నక్కి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఐద్వా నూతన కమిటీ సమా వేశాన్ని నిర్వహించారు. సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబె ట్టుకోవాలన్నారు.

వైసీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా వెంకటేశ్వరరెడ్డి



ప్యాపిలి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా మండలానికి చెందిన మెట్టు వెంకటేశ్వరరెడ్డి నియమితులయ్యారు. ఈ మేర కు అధిష్టానం నుంచి నియామక ఉత్తర్వులు అంది నట్లు ఆయన తెలిపారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, యువ నాయకుడు బుగ్గన అర్జున్ అమరనాథ్‌రెడ్డిలకు వెంకటేశ్వరరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు

బేతంచెర్ల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించడం సరైంది కాదని సీఐటీ యూ జిల్లా కార్యదర్శి నాగరాజు పేర్కొన్నారు. గురువారం సీఐటీయూ జనరల్ బాడీ సమావేశం సీఐటీయూ కార్యాలయంలో పట్టణ నాయకులు రామాంజనేయులు అధ్యక్షతన గురువారం నిర్వహిం చారు. ఈ సమావేశానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఉపా ధ్యక్షుడు వై.ఎల్లయ్య మాట్లాడారు. ఎనిమిది గంటల పనిదినాన్ని కార్మి కులు పోరాటం చేసి తెచ్చుకుంటే ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం 12 గంటలు పని చేయాలని తీసుకురావడం ఈ విధానానికి రాష్ట్ర ప్రభుత్వం తెరలేపడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశా రు. లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా జూలై 9న దేశవ్యాప్తంగా జరుగుతున్న జాతీయ సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జి.వేణుగో పాల్, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, రహంతుల్లా, మద్దిలేటి, తిమ్మయ్య, శేషు, ఎస్కే బాషా, ఆశా వర్కర్ నాగేంద్రమ్మ, సుజాత, పుష్పావతి పాల్గొన్నారు.

సబ్ కోర్టు ఏజీపీగా శేషశయనరావు



డోన్ టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది శేష శయనరావును సబ్‌కోర్టు ఏజీపీగా నియ మిస్తూ గురువారం నంద్యాల జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. శేషశయనరావు నియామకంపై సీనియర్ న్యాయవాదులు హరి మురళీధర్‌రావు, ఆంజనేయులుగౌడు, చిన్న రంగారెడ్డి, రాగుల రాముడు, శ్రీరాములు, కానాల మహేష్ హర్షం వ్యక్తం చేశారు.

రోటరీ క్లబ్ కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గంతో జిల్లా గవర్నర్, రోటరీ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని నంద్యాల రహదారిలో ఉన్న రోటరీ క్లబ్ సమావేశ భవనంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి రోటరీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రోటరి క్లబ్ అధ్యక్షుడిగా గుండా అశ్వర్థ నారాయణ, కార్యదర్శిగా రాజేష్ కుమార్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకు న్నారు. ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ కేశవరెడ్డి, అసిస్టెం ట్ గవర్నర్ సత్తార్ హాజీలు హాజరై మాట్లాడారు. అనంతరం పేద మహిళ జీవనోపాది కోసం కుట్టుమిషన్ అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు గుండా గోపాల్, సభ్యులు మద్దిలేటి స్వామి, విజయ నాగరాజు, సయ్యద్ అహ్మద్, మాణిక్యం శెట్టి, మగ్బుల్ హుసేన్, శ్రీధర్, వీరభద్రారెడ్డి, కేవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆరేళ్లుగా అంతే..!

- కొలిమిగుండ్లలో ఆయుర్వేదిక్ కేంద్రం మూత
- వైద్యులు, సిబ్బంది లేక నిలిచిన సేవలు

కొలిమిగుండ్ల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆయుష్మాన్ ఆరో గ్య సేవలు ఆరేళ్లగా నిలిచిపోయాయి. దీర్ఘకాలిక వ్యాధి గ్రస్థులకు ఎంతగానో ఉపయోగ పడే ఆయుర్వేదిక్ వైద్య సేవలు అందకపోవడంతో ప్రజలు ఇబ్బందు ఎదుర్కొంటు న్నారు. గతంలో ఈ విభాగానికి సంబంధించి కొలిమి గుండ్ల పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్యుడుతో పాటు, సిబ్బంది ఉండేవారు. అయితే గత ప్రభుత్వం ఆయుర్వేదిక్ వైద్య సిబ్బందికి జీతాలు చెల్లించకుండా నిలిపి వేయడంతో పాటు, మందులను కూడా సరఫరా చేయలేదు. దీంతో ఆయుర్వేదిక్ విభాగం పూర్తిగా మూతపడింది. దీర్ఘకాలిక రోగులను ఆదుకునే ఆయుర్వేదిక్ విభా గాన్ని తిరిగి పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం

గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో నిర్విఘ్నంగా కొనసాగిన ఆయుర్వేదిక్ సేవలను తిరిగి పునరుద్ధరించ డానికి కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని మండల ప్రజలు కోరుతు న్నారు. ప్రస్తుతం వైద్యపరంగా ప్రజల్లో సైతం మార్పు చోటు చేసుకుం టోంది. ఆయుర్వేదిక్, హోమియో వైద్య సేవలపై ప్రజలు మొగ్గు చూపు తున్నారు. ఈ సమయంలో ప్రాథమిక వైద్య కేంద్రాల్లో ఆయుర్వేద వైద్య సేవలను పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీర్ఘకాలిక వ్యా ధులతో అనేక మంది రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరంద రికీ ఆయుర్వేద వైద్య సేవలు అందితే ఉపయోగం ఉంటుంది.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించొద్దు

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గార్లపాటి మద్దిలేటి


సబ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇస్తున్న డాక్యుమెంట్ రైటర్లు, కాంగ్రెస్ నాయకులు

డోన్ రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): డోన్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించొద్దని కోరుతూ గురువారం డాక్యుమెంట్ రైటర్స్‌తో కలిసి కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్, ఆర్డీవోలకు వినతి పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నియోజ కవర్గ ఇన్‌చార్జి గార్లపాటి మద్దిలేటి మాట్లాడుతూ పాతభవనంలో నడు స్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని డోన్ పట్టణం వెలుపలకు తరలించడం వల్ల భద్రతా సమస్యలు ఏర్పడుతాయన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని యథాస్థానంలోనే కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లెంపల్లె జనార్దన్, శేఖర్, మహేంద్ర నాయుడు, వడ్డె రాజశేఖర్, మధుసూదన్ రెడ్డి, హనుమాన్ పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్ టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఆర్డీవో కేవీ నరసింహులు, కమిషనర్ ప్రసాద్‌గౌడు, తహసీల్దార్ రవికుమార్, అర్బన్, రూరల్ సీఐలు ఇంతియాజ్ బాషా, రాకేష్‌బాబు హాజరయ్యారు. ముందుగా ర్యాలీని ఎమ్మెల్యే కోట్ల ప్రారం భించారు. ఈ ర్యాలీ నుంచి మున్సిపల్ కార్యాలయం నుంచి పాతబస్టాం డు వరకు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లకుం డా మీ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవా లన్నారు. కార్యక్ర మంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, టీడీపీ నాయకులు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి విజయభట్, ఓంప్రకాష్, టైలర్ ఖాజా, సీమ సుబ్బారెడ్డి, సీడీపీవో శంషాద్‌బేగం, ఎక్సైజ్ ఎస్‌ఐలు సోమ శేఖర్, దౌలత్‌ఖాన్, అర్బన్ ఎస్‌ఐ శరత్ కుమార్ రెడ్డి, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం: సీఐ

ప్యాపిలి: డ్రగ్స్ రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యమని సీఐ వెంకట రామిరెడ్డి అన్నారు. గురువారం మాదకద్రవ్యాల వ్యతి రేక దినోత్సావాన్ని పురస్కరించుకుని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలు పునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ మధు సూదన్, నవీన్‌పాటి, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: డ్రగ్స్ రహిత సమాజం కోసం యువత, విద్యార్థులు కృషి చేయాలని డీఎస్పీ ప్రమోద్ కుమార్ పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డలోని


కొవెలకుంట్లలో మాట్లాడుతున్న సీఐ హనుమంతనాయక్

ఎద్దుల పాపమ్మ కళాశాలలో గురువారం ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ అన్ని శాఖల అధికారులు పాల్గొని సంయుక్తంగా డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగం గా రాష్ట్ర వ్యాప్తంగా మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అలాగే మానవ హారం ఏర్పాటు చేశారు. రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, టౌన్ సీఐ యుగంధర్, మున్సిపల్ చైర్మన్ కిషోర్, తహసీల్దార్ జ్యోతి రత్న కుమారి, ఎంపీడీవో నూర్జహాన్, ఎస్‌ఐ సర్వస్వతి, ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు అమీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె: మెరుగైన సమాజం కోసం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడదామని బనగానపల్లె ప్రొహిబిషన్ అండ్ బనగానపల్లె సీఐ మం జునాథరెడ్డి, బనగనాపల్లె ఎక్సైజ్ సీఐ సతీశ్ పిలుపునిచ్చారు. గురు వారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఎక్సైజ్ సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులతో కలసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ శాఖ ఎస్‌ఐ కరుణాకర్ పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోవెలకుంట్ల సీఐ హనుమంతనాయక్ సూచించారు. గురువారం యాం టి డ్రగ్స్‌పై అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా కోవెలకుంట్ల ఎక్సైజ్ సీఐ టకీబాషా, ఎస్‌ఐ సందీప్‌యాదవ్ ఆ ధ్వర్యంలో పట్టణంలోని ప్రభ్వు జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి అధ్యక్షతన విద్యార్థులకు యాంటిడ్రగ్స్‌పై అవాహన కల్పించారు.ముఖ్య అతిథులుగా ఎంపీడీవో వరప్రసాదరావు, తహసీల్దారు పవన్‌కు మార్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, రమణయ్య హాజరయ్యారు. పట్టణంలోని గ్రామపంచాయతీ సర్కిల్‌లో మానవ హారంగా నిర్వహించి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

రుద్రవరం: డ్రగ్స్‌తో యువత జీవితం నాశనం అవుతుందని అని వీఆర్వోలు సంజీవ్‌రెడ్డి, పుల్లయ్య అన్నారు. గురువారం రుద్రవరంలో వీధుల గుండా డ్రగ్స్ నివారణపై రెవెన్యూ సిబ్బంది ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. వీఆర్వోలు ఓబయ్య, హుసేనీ, అంకాల్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: దేశంలో డ్రగ్ రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తహసీల్దారు సువర్ణదేవి పిలుపునిచ్చారు. గురువారం పోలీసులతో కలిసి స్థానిక రెవెన్యూ కార్యాలయ సమీపంలో ప్రతిజ్ఞ చేశారు. డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్‌బాబు, ఆర్‌ఐ అంకన్న, ఎఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి వీఆర్వోలు ఉన్నారు.


డోన్‌లో విద్యార్థులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే కోట్ల, ఆర్డీవో నరసింహులు


ఆళ్లగడ్డలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



ర్యాలీ చేస్తున్న బనగానపల్లె సీఐ మంజునాథరెడ్డి, ఎక్సైజ్ సీఐ సతీష్


ప్యాపిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

టీడీపీ కార్యకర్తకు బీసీ రాజారెడ్డి పరామర్శ


బాలదుర్గారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో చికిత్స పొందు తున్న టీడీపీ కార్యకర్త విష్ణువర్ధన్‌రెడ్డి తండ్రి బాల దుర్గారెడ్డిని నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి గురువారం పరా మర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన సేవలందించాలని ఆయన కోరారు.

నట్టల నివారణ మందు తాపించాలి

రుద్రవరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గొర్రెలకు నట్టల నివారణ మందు తాపించాలని పశు సంవర్థకశాఖ డిప్యూటీ డైరెక్టరు రమణయ్య, అసిస్టెంటు ఏడీ సుభాన్‌బాషా సూచించారు. గురువారం రుద్రవరంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించారు. వారు మాట్లాడుతూ వర్షాకాలం ముందు గొర్రెలు, మేకల్లో నట్టల నివారణ మందు తప్పనిసరిగా తాపించాలన్నారు. ఈ నట్టల నివారణ మందు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందుబాటులోకి తెచ్చిందన్నారు. పశు వైద్యాధికారి మనోరంజన్‌ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ క్లెయిమ్స్‌ను త్వరగా పూర్తి చేయాలి

ఉయ్యాలవాడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే విస్తరణలో భాగంగా పెండింగులో ఉన్న క్లెయిమ్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్ సూచించారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవే కింద మండలంలో ఐదు గ్రామా లు ఉన్నాయన్నారు. ఇందులో భాగంగా బోడెమ్మనూరు, మాయలూరు, అల్లూరు గ్రామాల్లో వాటికి సంబంధించి భూసేకరణ క్లెయిమ్‌లు పెం డింగులో ఉన్నాయన్నారు. వాటిని శనివారంలోపు పూర్తి చేసి నంద్యాల కలెక్టరు కార్యాలయంలో అందించాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రుద్రవరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం (54) చికిత్స పొందుతూ ఈ నెల 25న సాయంత్రం నం ద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందినట్లు ఎస్‌ఐ వరప్రసాద్ గురు వారం తెలిపారు. మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఈ నెల 21న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందారు. సుబ్రహ్మణ్యం భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా 16 రోజుల పండుగ

బనగానపల్లె, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో ఈనెలలో నిర్వహించిన పెద్దమ్మ జాతర 16వ రోజుకు చేరుకో వడంతో గురువారం పెద్దమ్మ జాతర వేడుకలు అంగరంగవైభవంగా నిర్వ హించారు. గ్రామ కమిటీ వారు గ్రామ పొలిమేరలో ప్రత్యేక మండపం పె ద్దమ్మతల్లికి ఏర్పాటుచేశారు. ఇందులో భాగంగా అక్కడ కొలువన పెద్దమ్మ తల్లిని చల్లరిచే క్రమంలో చల్లముద్ద నైవేద్యంగా గ్రామస్థులు సమర్పించి ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

నాణ్యమైన ఆహారం ఇవ్వాలి

చాగలమర్రి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన ఆహారం ఇవ్వాలని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల సూచించారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల గ్రేడిం గ్‌ను, సంబంధిత రికార్డులను, పరిసరాలను పరిశీలించారు.

గోస్పాడు మండల పరిశీలకుడిగా రామేశ్వరరెడ్డి


మంత్రి ఫరూక్‌తో కలిసి సమావేశంలో పాల్గొన్న రామేశ్వరరెడ్డి

కొలిమిగుండ్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకిరె డ్డిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వర రెడ్డిని గోస్పాడు మండల పరిశీలకుడిగా నియమించారు. టీడీపీ సంస్థాగత కమిటీల నియామక పక్రియ కార్యక్రమాన్ని గురువారం మంత్రి ఫరూక్ అధ్యతన నిర్వహించారు. రామేశ్వరరెడ్డికి పలువురు టీడీపీ నేతలు అభినందనలు తెలిపారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి

కొలిమిగుండ్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని కొలిమి గుండ్ల సీఐ రమేష్‌బాబు సూచించారు. మండలంలోని తిమ్మనాయి నిపేట గ్రామంలో మొహర్రం వేడుకలపై గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. పీర్ల పండుగ సందర్భంగా ఎటువంటి గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు చేపడతామని నిర్వాహకులను హెచ్చరించారు. ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ సుబ్బరాయుడు, పోలీసు సిబ్బంది, కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధికి రూ.5 లక్షలు మంజూరు

ఉయ్యాలవాడ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రూపన గుడి గ్రామ చెరువు అభివృద్ధి రూ. 5 లక్షల నిధులు మంజూరు అయి నట్లు సాగునీటి సంఘం అధ్యక్షుడు కర్నాటి మహేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం ఎక్స్‌కవేటర్ సాయంతో ప్రధాన కాలువలో పూడికతీత పనులను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం నుంచి ఈ నిధులు మంజూరు అయ్యాయన్నారు. టీడీపీ నాయ కులు రామస్వామిరెడ్డి, రామచంద్రుడు, భాష తదితరులు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఉయ్యాలవాడ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ సమా వేశంలో వ్యవసాయం, వెలుగు, ఉపాధిహామీ, విద్యుత్, పశుసంవర్థక, తాగునీరు, వైద్యం, విద్య తదితర శాఖల అభివృద్ధి పనులపై చర్చిం చనున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు హాజరు అవ్వాలని ఆయన కోరారు.

గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ

కొవెలకుంట్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబ స్టాండు సమీపంలో నారా చంద్రబాబు నాయుడు ఇండోర్ స్టేడియం పక్కనున్న గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ అధికారి ప్రకాశ్‌నాయుడు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు.

సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ప్రజలు సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య విస్తరణాధికారి వెంకటే శ్వర్లు సూచించారు. గురువారం ముత్యాలపాడు గ్రామంలో అతిసార నివారణ మాసోత్సవాలపై అవగాహన కల్పించారు.

సాయిబాబా ఆలయానికి విరాళం


ధర్మవరం సుబ్బారెడ్డికి విరాళాన్ని అందజేస్తున్న లోకేశ్‌గౌడు

డోన్ టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణం హైవే సమీపంలో వెలసిన షిరిడీ సాయిబాబా ఆలయ అభివృద్ధికి బేతంచెర్ల పట్టణానికి చెందిన ఈడిగ లోకేశ్‌గౌడు రూ.50,116 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు, రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డికి గురు వారం అందజేశారు. అనంతరం విరాళాన్ని అందజేసిన దాతలను స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం సాయిబాబాకు ప్రత్యేక పూజ లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పార్థసారధి, ఆలా మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

ప్యాపిలి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలను నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో సీపీఐ ముందుండి పోరాటాలు చేస్తుందన్నారు. ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు పేదలకు ఇళ్ల పట్టాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల 30, 31 తేదీల్లో డోన్‌లో నిర్వహించే జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు వెంకటేశ్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డోన్ రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రామభూపాల్, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్‌లు అన్నారు. గురువారం మండలంలోని కొత్తబురుజులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్ నాగరత్న, సిస్టర్స్ పెద్దక్క, గీత కళ్యాణి, ఇందిర పాల్గొన్నారు.

మంత్రి బీసీకి ముస్లింల కృతజ్ఞతలు


కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ముస్లింలు

బనగానపల్లె, జూన్ 26(ఆంధ్రజ్యోతి): తొలిసారిగా బనగానపల్లె పట్టణంలోని ఆస్థానం పీర్ల ఉత్సవాలకు కూటమి ప్రభుత్వాన్ని ఒప్పించి రూ.10లక్షలు కేటాయించిన రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి ముస్లింలు గురువారం కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని ఆస్థానం రోడ్డులోని ఆస్థానం పీర్ల చావిడి ఎదుట టపాసులు పేల్చి ముస్లింలు సంబరాలు చేసున్నారు. అనంతరం ఆస్థానం పీర్ల చావిడితో కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. మతగురువు మౌలానా, ఉప సర్పంచ్ బురానుద్దీన్, నియాజ్‌హుసేన్, హైదర్, అమీర్‌జాన్, మహ మ్మద్ రఫీ, అల్తాఫ్‌హుసేన్, అబ్బాస్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న జేసీ విష్ణుచరణ్

పగిడ్యాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పగిడ్యాల తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని సిబ్బంది వివరాలను తహసీల్దార్ శివరాముడిని అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సమస్యల గురించి ఆరా తీశారు. అనంతరం కార్యాలయంలోని రికార్డు, కంప్యూటర్, వీఆర్వోల గదులను పరిశీలించారు. కార్యాలయంలోని పలు గదులు పెచ్చులూడిపడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని, ఆయా గదుల్లో విధులు నిర్వహించేందుకు ఇబ్బందిగా ఉందని తహసీల్దార్ జేసీ దృష్టికి తీసుకెళ్లారు.

మహానందిలో ఆర్‌జేటీసీ పూజలు



కమిషనర్ బసిరెడ్డిని ఆశీర్వదిస్తున్న వేదపండితులు

మహానంది, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో గురువారం ఏపీ రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బసిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయం ముఖమంటపం వద్ద ఇన్‌చార్జి సూపరింటెండెంట్ పసుపుల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చన పూజలు నిర్వహించారు. అలంకార మండపంలో వేదపండితులు వీరిని శాలువాతో సన్మానించి ప్రసాదాలు అందజేశారు.

నట్టల నివారణ మందు తాపించాలి



పార్నపల్లె గొర్రెకు మందు తాపిస్తున్న ఏడీ వెంకటేశ్వర్లు

బండిఆత్మకూరు జూన్ 26(ఆంధ్రజ్యోతి): జీవాలకు నట్టల నివారణ మందు తాపించాలని, దీనివల్ల వల్ల మరణాల తగ్గిపోతాయని పశుసంవర్థకశాఖ వెలుగోడు సహాయ సంచాలకుడు వెంకటేశ్వర్లు పెంపకందారులకు సూచించారు. పార్నపల్లె, బండిఆత్మకూరు గ్రామాల్లో గురువారం పశువైద్యాధికారులు జ్యోత్స్న, అనూష నట్టల నివారణ శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమాన్ని రెండు చోట్ల ఏడీ పరిశీలించి, గొర్రెలకు మందు తాపించారు. ఈ మందు తాపడం వల్ల గొర్రెలు, మేకలు, వాటి పిల్లల మరణాలు చాలా వరకు తగ్గిపోతాయని, జీవాలు శరీర దారుఢ్యం కల్గి ఉంటాయని చెప్పారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మిడుతూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మిడుతూరు గ్రామానికి చెందిన పాత్రికేయుడు మధుసూదన్‌బాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. ఆయన కుటుంబానికి వైసీపీ పార్టీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి రూ.50 వేలు ఆర్థిక సాయం ఇచ్చారు. ఈ ఆర్థిక సాయాన్ని నందికొట్కూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా చిన్నమల్లారెడ్డి, బన్నూరు నాగిరెడ్డి, వైసీపీ పార్టీ మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గురువారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

మత్తుతో జీవితం చిత్తు

- డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకుందాం
- బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలి
- మాదకద్రవ్యాల వ్యతిరేక దినంలో ప్రజాప్రతినిధులు, అధికారులు



నందికొట్కూరులో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే



పాణ్యం: ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



ఆత్మకూరులో ర్యాలీ

నందికొట్కూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు చిత్తు అవుతాయని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. గురువారం మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా నందికొట్కూరు పట్టణంలో విద్యార్థులు, అధికారుల సమక్షంలో మాదకద్రవ్యానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన ర్యాలీలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ ప్రజలు, యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని అన్నారు. ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ మత్తు పదార్థాలకు యువత అలవాటు పడకుండా ఉంటేనే తమ భవిష్యత్తు బాగుంటుందని, బాగా చదువుకోవాలని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అన్నారు. అనంతరం పటేల్ సెంటర్ వద్ద విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నంద్యాల ఎడ్యుకేషన్: మత్తు మానవత్వాన్ని మింగేస్తుందని, మత్తుతో జీవితాలు నాశనం చేసుకోవద్దని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ విభాగం సభ్యులు విద్యార్థులకు సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నంద్యాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేశారు. డీసీపీఎస్ సభ్యులు నాగజ్యోతి, ఓబులమ్మ, లక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం చంద్రలేఖ మాట్లాడుతూ సమాజంలో మత్తు వ్యసనం రోజురోజుకు పెరుగుతోందని, మత్తు వ్యక్తిని శారీరకంగా, మానసికంగా కుంగదీయడంతో పాటు ఆర్థికంగా నష్టపరుస్తుందని అన్నారు. వ్యవసనాలకు బానిస కావొద్దని సూచించారు. అనంతరం విద్యార్థినుల చేత ప్రమాణం చేయించారు.

ఆత్మకూరు: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకుందామని,

ఇందుకోసం ప్రజలందరూ సంఘటితంగా కృషిచేయాలని ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక, అర్బన్ సీఐ రాము, ఎక్సైజ్ సీఐ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మాదకద్రవ్యాల వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని ఎక్సైజ్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో విద్యార్థుల కలిసి పాతబస్టాండ్ నుంచి గౌడ్‌సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. వారు మాట్లాడుతూ ఎక్కడైనా మాదక ద్రవ్యాల విక్రయాలు జరిగితే డయల్ 100 లేదా టోల్ ఫ్రీ 14405 సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి డ్రగ్స్ నిర్మూలనకై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ జగదీష్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న తదితరులు ఉన్నారు.

మహానంది: యువత మేలుకో భవితను మలుచుకో డ్రగ్స్‌ను వదులకో అనే నినాదంతో ఎం.తిమ్మాపురంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు ర్యాలీ నిర్వహించారు ఎంపీడీవో మహమ్మద్ దౌలా మాట్లాడుతూ ప్రధాన మంత్రి నసా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం చేపట్టారని చెప్పారు. తహసీల్దార్ రమాదేవి, ఎంపీహెచ్‌ఈవో ఉసేన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్, వీఆర్వో సురేంద్రనాథ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాణ్యం: మాదకద్రవ్యాలతో బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని, మాదకద్రవ్యాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పాణ్యం పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఐలు నరేంద్ర కుమార్ రెడ్డి, నాగార్జునరెడ్డి, తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో సుబ్రహ్మణ్యం, టి.చంద్రయ్య ప్రభుత్వ జూనియర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



మహానంది: ఎం.తిమ్మాపురంలో..



నంద్యాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

జగజ్జననీ అమ్మవారికి పుట్టింటి చీర



అమ్మవారికి పుట్టింటి చీర, సారె తీసుకెళ్తున్న భక్తులు

నంద్యాల కల్చరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జగజ్జననీ ఆలయంగా ప్రసిద్ధిగాంచిన నంద్యాల జగజ్జననీ అమ్మవారికి ఆషాడమాసం సందర్భంగా భక్తులు అమ్మవారికి చీర, సారె సమర్పించుకుంటారు. గురువారం ఆషాడమాసం సందర్భంగా మొదటిరోజు జగజ్జననీ అమ్మవారికి ఆళ్లగడ్డ, నంద్యాల, గిద్దలూరు, శివమొగ్గ, హైదరాబాద్, కర్నూలు, డోన్, కడప నుంచి వందలాది మంది మహిళా భక్తులు అమ్మవారికి పుట్టింటి చీర సారె తీసుకొని వచ్చి సమర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారిని అలంకరించి భక్తులు పట్టుచీర, సారె తీసుకొని నంద్యాల బాలకొండహాలు నుంచి ఆత్మకూరు బస్టాండు మీదుగా అమ్మవారి వేషధారణలతో భక్తులు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా భక్తి పాటలు పాడుతూ జగజ్జననీ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి పుట్టింటి పట్టుచీర, సారె సమర్పించారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వందలాదిమంది మహిళా భక్తులు పాల్గొన్నారు.



గౌరీదేవికి గోరింటాకు వేడుక నిర్వహిస్తున్న భక్తులు

గోరింటాకు వేడుక

ఆషాడమాసం సందర్భంగా రమాసమేతసత్యనారాయణ స్వామి దేవాలయంలో మొదటిరోజు గురువారం గౌరీదేవి అమ్మవారికి గోరింటాకు వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీదేవి, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

83 మందికి ఉద్యోగాలు

నందికొట్కూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం జాబ్ మేళా నిర్వహించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి అభ్యర్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ జాబ్ మేళాకు 194 మంది అభ్యర్థులు హాజరు కాగా 83 మందికి వివిధ ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగ అర్హత సాధించినట్లు అధికారి తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ సునీత, సెట్కూర్ సీఈవో వేణుగోపాల్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సోమశివారెడ్డి వివిధ కంపెనీల సిబ్బంది పాల్గొన్నారు.

నాగలూటిలో వైద్య శిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మిడుతూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలూటి గ్రామంలో సీజన్ వ్యాధుల సోకకుండా ముందస్తుగా వైద్యాధికారి రాజు ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఇంటి చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవీంద్రబాబు, సీహెచ్‌వో సురేష్ బాబు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏసేపు, రామతులశమ్మ, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

మహానంది, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మసీదుపురంలో గ్రామానికి చెందిన మునగాల రామసుబ్బారెడ్డి(51) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈనెల 25న రాత్రి గ్రామ శివారు ప్రాంతంలో రామసుబ్బారెడ్డి కొంతమంది వ్యక్తులతో కలసి మద్యం తాగినట్లు సమాచారం. గురువారం ఉదయం శివారులోని వ్యవసాయ బావిలో రామసుబ్బారెడ్డి మృతదేహం కనిపించినట్లు ఎస్‌ఐ చెప్పారు. రామసుబ్బారెడ్డి భార్య తులశమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ..

గోస్పాడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కానాలపల్లె గ్రామానికి చెందిన చిన్న మద్దిలేటి (28) చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలివీ.. చిన్నమద్దిలేటి గతకొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేవారు. దీంతో జీవితంపై విరక్తిచెంది బుధవారం రాత్రి విషద్రావణం తాగారు. కుటుంబ సభ్యులు ఆయనను నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. చిన్నమద్దిలేటి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. చిన్నమద్దిలేటి తల్లి శివమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీడీపీకి కార్యకర్తలే బలం : ఎమ్మెల్యే

పగిడ్యాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలే బలమని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. పగిడ్యాల గ్రామంలోని టీడీపీ నాయకుడు పుల్యాల రాజశేఖర్‌రెడ్డి స్వగృహంలో మండల బూత్ యూనిట్ క్లస్టర్ ఇన్‌చార్జిలతో మండల విస్తృత స్థాయి సమావేశాన్ని గురువారం సాయంత్రం నిర్వహించారు. ఎమ్మెల్యే మాటాడుతూ గ్రామస్థాయిలోని నాయకులు, కార్యకర్తలు ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ప్రజలకు అందజేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. అంతకుముందు పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల కన్వీనరు పలుచాని మహేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు దామోదర్‌రెడ్డి, వాసురెడ్డి, శ్రీనివాసులు, విజయ్ వివిధ గ్రామాలకు చెందిన బూత్ లెవల్, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

జూపాడుబంగ్లా: కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. గురువారం జూపాడుబంగ్లాలోని వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆధ్వర్యంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంటేశ్వర్లు, నాయకులు గిరీశ్వర రెడ్డి, మోహన్ రెడ్డి, రమణరెడ్డి, శ్రీనివాసులు, రామ్మోహన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, పరమేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

ఆత్మకూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు కోర్టు భవనాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సహకరించాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరిని గురువారం ఆత్మకూరు బార్ అసోసియేషన్ ప్రతినిధులు విన్నవించారు. పగిడ్యాల మండలంలోని ముచ్చుమర్రి గ్రామంలో గల ఆమె గృహంలో ఎంపీ బైరెడ్డి శబరిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంచర్ల గోవింద రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఆత్మకూరులో ఉన్న కోర్టు భవనాలు శిథిలావస్థకు చేరుకుని దెబ్బతిన్నాయని, ఇప్పటికే పలు గదులు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. ఈ పరిస్థితుల్లో కోర్టు భవనాల అభివృద్ధి ఎంపీ నిధుల నుంచి కేటాయింపులు చేయాలని కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు శివశంకర్, పుల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, గిరిరాజు, లక్ష్మీనారాయణ కేశవరెడ్డి, మహెబూబ్‌బాషా, రవికుమార్, మల్లికార్జునసింగ్, సుదర్శన్, బతుకు లయ్య, హుసేన్‌మియ్య, భాస్కర్, చింతలయ్య ఉన్నారు.

మార్కెట్‌యార్డు అభివృద్ధికి సహకరించాలి

నంద్యాల ఎడ్యుకేషన్: నంద్యాల మార్కెట్‌యార్డు అభివృద్ధికి సహకరించాలని చైర్మన్ గుంటుపల్లి హరిబాబు ఎంపీ బైరెడ్డి శబరిని కోరారు. చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ రంగప్రసాద్, డైరెక్టర్లు మదార్‌సా, స్వామినాయక్, రవి, నూర్ బాషా, అజ్మీర్ గురువారం పట్టణంలో ఎంపీ బైరెడ్డి శబరిని ఆమె కార్యాల యంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. మార్కెట్ యార్డులో సమస్యలను పరిష్కరించేలా చూడాలన్నారు.

దత్తాత్రేయ స్వామికి పూజలు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద నెలకొన్న దత్తాత్రేయ స్వామికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం సేవల్లో భాగంగా దత్తాత్రేయ స్వామివారికి పంచామృతాభిషేకంతో పాటు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పండితులు స్వామివారి చరిత్ర గురించి భక్తులకు వివరించారు. ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద దత్తాత్రేయుల వారు తపస్సు చేశారని, అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షమని పేరు వచ్చిందని తెలిపారు.

సంక్షేమ పథకాలు అందించాలి

నంద్యాల రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు సూపర్‌సిక్స్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శులు లక్ష్మణ్, వెంకట లింగం డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కళ్లకు గంతులతో రెండవరోజు నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్ కార్మికుల న్యాయబద్ధమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదని ఆరోపించారు. జిల్లా నాయకులు భాస్కరాచారి, రామాంజనేయుడు, రంగనాథ్, బాలదుర్గన్న, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



భక్తులతో వివరాలు అడిగి తెలుసుకుంటున్న దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆలయంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తీసుకోవాలని దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ ఆలయ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఆలయ ఈవో శ్రీనివాసరావుతో కలిసి ఆలయ ప్రాంగణం, క్యూలైన్‌లు, ప్రసాదాల విక్రయకేంద్రాలు, అన్నప్రసాద వితరణ, కల్యాణకట్ట తదితర వాటి వద్ద పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ యాత్రికులు బస చేసే దేవస్థానం సత్రాలు, కాటేజీలు, జన సమూహం ఎక్కువగా కూడళ్ల వద్ద ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తొలగించాలని ఆదేశించారు. పారిశుధ్య విభాగం అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు.

దాడులను ఖండించాలి

ఆత్మకూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధోన్మాద దాడులను కేంద్ర ప్రభుత్వం ఖండించాలని సీపీఎం నాయకులు ఏసురత్నం, రణధీర్ అన్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న సంకీర్ణ యుద్ధానికి నిరసనగా గురువారం ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధాన్ని కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రపంచ శాంతి కోసం యుద్ధోన్మాదానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రధాని మోదీ దేశ ప్రజలను కూడకట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, వీరన్న, నాగేశ్వరరావు, గణపతి, నూర్, చాంద్, వెంకటేశ్వర్లు, రవి, రాము, మద్దిలేటి, భాస్కర్, సలీం తదితరులు ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి: డీపీవో



సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో లలితాబాయి

గడివేముల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలో ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామంలో షానిటేషన్ పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలని అన్నారు. వాటర్ ట్యాంకులను పరిశుభ్ర పరచాలని అన్నారు. అనంతరం చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను పరిశీలించారు. పారిశుధ్య సిబ్బందికి ప్రజలు తడిచెత్త, పొడిచెత్తను వేరు వేరుగా ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఈవోఆర్డీ మహిధర్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి



గిరిజనులకు సూచనలు చేస్తున్న టీబీ సూపర్‌వైజర్

ఆత్మకూరురూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదని, క్షయ వ్యాధిని రూపుమాపేందుకు సహకరించాలని టీబీ సూపర్‌వైజర్ కల్లూరి మస్తానయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ధనలక్ష్మిలు సూచించారు. మండలంలోని ఇందిరేశ్వరం గూడెంలో చెంచులకు, విద్యార్థులకు క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామతులసి, ఆరోగ్య సిబ్బంది వసుంధర, లక్ష్మీదేవి, సరోజమ్మ పాల్గొన్నారు.